క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నుంచి తాగు నీటి సరఫరాకు ఆదివారం అంతరాయం కలగనున్నట్లు కమిషనర్ అబ్దుల్‌షరీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి పట్టణంలో శుక్రవారం కురిసిన వర్షాలకు ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినిందని, మరమ్మతులు పూర్తయ్యే వరకు నీటి సరఫరా జరగదని తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి ఎ.అంజయ్య తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు కథలు, ఆర్ట్స్, మెగా స్పోర్ట్స్, గేమ్స్ వంటివి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

26న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న మయూరి శ్యామ్

గూడూరు రూరల్ : గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని యాదవ విద్యార్థులకు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు రోటేరియన్ మయూరి శ్యామ్ తెలిపారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది పదో తరగతిలో 475లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు తమ దరఖాస్తులను మార్కుల జాబితా కలిపి 9948606664, 9705800794 నంబర్లకు వాట్సప్ ద్వారా పంపి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వారికి నెల్లూరులోని అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేస్తామని వెల్లడించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై శనివారం రాత్రి బైక్ అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన రాము, సురేష్ శనివారం వెదురుపట్టు రాజుపాళెం గ్రామంలో మేస్త్రీ పనులు చేశారు. రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. వెదురుపట్టు సమీపంలో రోడ్డు మీద ఉన్నట్టుండి కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఇద్దరూ గాయపడ్డారు. వారిని స్థానికులు ఆటోలో శ్రీకాళహస్తికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఏఎంసీ చైర్మన్ జనార్దన్ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అభయ అనుగ్రహ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆలయ మర్యాదలతో సత్కరించి ఆశీర్వాదం అందజేశారు.

రోగులకు చేరువలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు


దొరవారిసత్రం : పోలిరెడ్డిపాళెంలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం


పెళ్లకూరు : కలవకూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఉమ, సిబ్బంది

రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో వైద్య సదుపాయం లేక ప్రజలు చికిత్స కోసం పట్టణాలకు పరుగులు తీసే పరిస్థితి. తమ సంపాదనలో ఎక్కువ భాగాన్ని రోగాలకే ఖర్చు చేయాల్సిన దుస్థితి. దీంతో వారి బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించినప్పుడే పేదరికం నుంచి బయటపడతారని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. తన పాలనా కాలంలో విద్య, వైద్య రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేశారు. తగినంత మంది సిబ్బందిని నియమించారు. 12 రకాల వైద్య సేవలు, 12 రకాల వైద్య పరీక్షలను అందుబాటులోకి తెచ్చారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. వైద్యులను ఇంటి వద్దకే పంపించి వైద్యసేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ క్లినిక్‌లు విజయపథంలో నడుస్తూ గ్రామాల్లోని రోగులకు వైద్య సేవలను అందిస్తున్నాయి.

– దొరవారిసత్రం

- 12 రకాల వైద్య సేవలు
- 14 రకాల వైద్య పరీక్షలు
- అందుబాటులో మందులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు

సూళ్లూరుపేట నియోజకవర్గ సమాచారం

డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల సంఖ్య :	66
ఒక్కో భవన నిర్మాణానికి చేసిన వ్యయం:	రూ.17.50
క్లినిక్‌లో నియమితులైన వైద్య సిబ్బంది :	66 మంది
రోజుకు నమోదయ్యే ఓపీల సంఖ్య :	1500


సూళ్లూరుపేట : ఇలుపూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రక్త పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో 2500 జనాభాకు వైద్య సేవలు అందించేలా డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఒక్కో భవనాన్ని రూ.17.50 లక్షలతో నిర్మించింది. సూళ్లూరుపేట మండలంలో 8, తడలో 16, పెళ్లకూరులో 13, దొరవారిసత్రంలో 11, ఓజిలిలో 8, నాయుడుపేటలో 10 అందుబాటులోకి తెచ్చింది. భవన వసతి లేని ప్రాంతాల్లో అద్దె భవనాల్లో సేవలను అందిస్తోంది. ఈ క్లినిక్‌ల్లో అన్ని వసతులు ఉన్నాయి. రోజుకు 20 నుంచి 30 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. వీటిలో సాధారణ జబ్బులతో పాటు పళ్ల సంబంధిత రోగాలతో పాటు కళ్లు, మానసిక తదితర 12 రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా బీపీ, షుగర్, అయోడిన్, వాటర్ క్వాలిటీ టెస్ట్, హెచ్‌బీఎస్ఏజీ, సుఖ వ్యాధులు, యూరిన్, మలేరియా, డెంగీ, కరోనా తదితర 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రత్యేకించి గర్భిణులకు పలు పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ క్లినిక్‌లను ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యాధికారులు పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

వైద్య కోసం పరుగులు తీయాల్సిన పనిలేదు



గతంలో జ్వరం, జలుబు, దగ్గు వంటివి వస్తే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా ప్రయివేట్ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రామంలోనే వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో అన్ని వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు కూడా ఇస్తున్నారు. రక్త పరీక్షల వంటివి కూడా చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. – రత్నమ్మ, తల్లంపాడు గ్రామం

మెరుగైన సేవలు అందుతున్నాయి



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకించి మహిళల సమస్యలకు కూడా వైద్య పరీక్షలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, మలేరియా వంటి వాటికి కూడా రూపాయి ఖర్చు లేకుండా రక్త పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. – సుధమ్మ, నెలబల్లి గ్రామం

వైభవంగా శ్రీవారి కల్యాణం


పెంచలకోనలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం విశేష అభిషేకాలు చేశారు. స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.


శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి కలవకొండ నృసింహుడి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల వెలుగులో లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రత్యేక అలకంరణలో ఉన్న చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు
- ఆరు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణ

చిల్లకూరు : లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కలవకొండ క్షేత్రం ముస్తాబైంది. ఇందులో భాగంగా ఆదివారం అంకురార్పణ చేపడతామని, ఆరు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండడంతో ఎక్కడా ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం అంకురార్పణం, సోమవారం ధ్వజారోహణం, అదే రోజు రాత్రి శేష వాహన సేవ నిర్వహిస్తామన్నారు. 21న పుష్పాలంకరణ, హనుమంత వాహన సేవ, 22న గరుడ వాహనం, 23న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, రాత్రి గజవాహన సేవ ఉంటాయన్నారు. 24న చక్రస్నానం, పుష్పయాగం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరు రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



రాపూరు: కలశాలతో ఊరేగింపుగా వస్తున్న ఆర్యవైశ్యులు, కోట: ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి

రాపూరు: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆర్యవైశ్యులు 102 కలశాలు తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

కోటలో...

కోట: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా శనివారం కోటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అలంకరణ, అర్చన, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సామూహిక కుంకుమార్చన, శ్రీవాసవి చాలీసా పారాయణం, పల్లకీ సేవ చేపట్టారు.


గూడూరు : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

గూడూరు పట్టణంలో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని బజారు వీధిలో ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు 102 కలశాలతో శివాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. అలాగే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారి పుట్టుకకు సంబంధించిన విశిష్టతను భక్తులకు తెలియజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


గూడూరు : కలశాలతో మహిళల ఊరేగింపు

27న ఉచిత ఖత్నా


మాట్లాడుతున్న ఇన్సాఫ్ కమిటీ సభ్యులు

గూడూరు రూరల్ : పేద ముస్లింల పిల్లలకు ఈ నెల 27న గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో ఉచితంగా ఖత్నా చేయనున్నట్టు ఇన్సాఫ్ కమిటీ సభ్యులు తెలిపారు. వారు శనివారం షాదీ మంజిల్‌లో సమావేశమయ్యారు. సభ్యుడు కాలేషా మాట్లాడుతూ ముస్లింలకు ఖత్నా ఎంతో ముఖ్యమన్నారు. ఇది ఖర్చుతో కూడుకున్నదని, పేదలకు మరింత భారమని తెలిపారు. ఈ క్రమంలో పేద ముస్లింల పిల్లల కోసం ఇన్సాఫ్ కమిటీ ఉచితంగా ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, షంషుద్దీన్, ఇబ్రహీం, నయూం, అల్తాఫ్, రఫీ, మహబలి నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వెంకన్న కల్యాణం


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటేశ్వర స్వామి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన వ్యూహ లక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం పద్మావతీ సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల మూల మూర్తులకు అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ వ్యవస్థాపకుడు చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామి వారి పరిణయోత్సవాన్ని శాస్త్రోక్తగా చేపట్టారు.

పెట్రోలు, డీజిల్ బాటిళ్లలో వేయొద్దు

ఏర్పేడు: మండలంలోని పెట్రోలు బంకుల యజమానులు ఎన్నికల నియమావళి ముగిసేంత వరకు వినియోగదారులకు విడిగా బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ విక్రయించరాదని ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ నెల 18 నుంచి జూన్ 16 వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు.

శ్రీకాళహస్తి: పెట్రోల్, డీజిల్‌ను విడిగా విక్రయించవద్దని రెండవ పట్టణ సీఐ రారాజు తెలిపారు. శనివారం నుంచి వచ్చే నెల 16 వరకు ఎవరికీ బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్‌ను విక్రయించకూడదన్నారు. విధ్వంస చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ నిబంధనలు విధించినట్లు తెలిపారు.

ట్రాఫిక్‌తో ఇక్కట్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తో మండల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోక పోవడంతో ట్రాఫిక్‌తో వాహనాలు నిలిచిపోతున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఆటోవాలాలు ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుని వాహనాలుదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బోర్డు ఒక చోట.. కౌంటర్ మరోచోట



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల చర్యలు విడ్డూరంగా ఉన్నాయి. ఓంకారస్వామి మఠం వద్ద పీఆర్వో కార్యాలయాన్ని, రూ.200 ప్రత్యేక కౌంటర్‌ను ఆలయ అధికారులు ఇటీవల ఏర్పాటు చేశారు. ఇటీవల పీఆర్వో కార్యాలయాన్ని అక్కడే ఉంచి, రూ.200 టికెట్ కౌంటర్‌ను మాత్రం ధూర్జటి గ్రంథాలయం వద్దకు మార్పు చేశారు. అయితే పీఆర్వో కార్యాలయం వద్ద రూ.200 టికెట్ కౌంటర్‌ను, బోర్డును అలాగే ఉంచేశారు. దీంతో భక్తులు అయోమయానికి గురవుతున్నారు. ఆ కౌంటర్‌లో ఎవరూ ఉండరు. వచ్చిన భక్తులు కాసేపు అక్కడ నిరీక్షించి, ఆ తరువాత విషయం తెలుసుకుని వెళ్లిపోతున్నారు.

హెచ్చరిక నోటీసు

తేది: 19.05.2024న ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ అయిన సదరు దేవరకొండ ప్రత్యూష తండ్రి రమణయ్య, కలువాయి గ్రామం, కలువాయి మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాస్తవ్యురాలు ఇచ్చిన సంజాయిషీ మేరకు తెలియజేడం ఏమనగా వెంకటగిరి టౌన్, తిరుపతి జిల్లా, సదరు చల్లా సుబ్రమణ్యేశ్వరరావు గారి కుమారుడైన చల్లా బాబురావు, వయస్సు 32 సం॥లు, వృత్తి కేబుల్ వర్కర్ మరియు యాక్షి కంపెనీలో పనిచేయుచున్న వ్యక్తితో గత 5 సం॥లుగా నా క్లయింట్‌కు పరిచయము ఏర్పడి, వారిద్దరి మనస్సులు కలసినందున వివాహమునకు సిద్ధపడినారు. 2 రోజుల క్రితము దేవరకొండ ప్రత్యూషకు చల్లా బాబురావు మధ్య తాత్కాలికముగా మనస్పర్థలు రావటం వలన, చల్లా బాబురావు ఇల్లు వదలి వెళ్లిపోయినాడు. మరియు ఈ దినం (18.05.2024 తేదీన) దేవరకొండ ప్రత్యూషకు ఫోను చేసి ఈ విధముగా మాట్లాడినాడు. అది ఏమనగా నేను వేరే అమ్మాయితో వివాహమునకు సిద్ధపడుచున్నాను. పెండ్లి చేసుకుంటాను అని చెప్పినాడు. ఆ విషయమును నా క్లయింట్ సమ్మతించలేదు. కారణము ఏమనగా నా క్లయింట్‌కు మరియు చల్లా బాబురావుకు వివాహ ఒప్పందం కుదిరినది. కాబట్టి సదరు చల్లా బాబురావు గారి వివాహము వేరే అమ్మాయితో జరుపుట చట్టబద్ధంగా చెల్లనేరదు. అట్లు ఎవరైనా చల్లా బాబురావు గారికి అమ్మాయినిచ్చి వివాహము జరిపిన యెడల సదరు వివాహము చట్టబద్ధంగా చెల్లనేరదు మరియు వివాహము రద్దు కాబడును. మరియు దానికి నా క్లయింటు బాధ్యురాలు కాదు.

షేక్ ఖాజారహంతుల్లా, బి.ఎ., బి.ఎల్.,
అడ్వకేట్, నెల్లూరు

కౌంటర్ సంతకం
దేవరకొండ ప్రత్యూష

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



శ్రీవారి ఆలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు

- నేడు అంకురార్పణ
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈవో సాగర్‌బాబు


ఈవో సాగర్‌బాబు

రాపూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఈవో డీసీ సాగర్‌బాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి రెండు లక్షల మందికి పైగా భక్తులు వస్తారని పేర్కొన్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేయనున్నామని తెలిపారు. పెంచలకోనలో బస్టాండు నుంచి ఆలయం వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. తాగునీటిని అందుబాటులో ఉంచామన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ, చలువ పందిళ్లు, క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 23వ తేదీన శ్రీవారి కల్యాణాన్ని అన్నదాన సత్రం పక్కనే ఉన్న మండపంలో నిర్వహిస్తామన్నారు. స్వామి వారి తెప్పోత్సవానికి ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఉత్సవాలకు బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పుష్పాలు తీసుకువస్తామన్నారు. అదేవిధంగా ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు వేపినాపి పీహెచ్‌సీ వైద్యుడు ధర్మేంద్ర తెలిపారు. 10 మంది డాక్టర్లు, 10 మంది సూపర్‌వైజర్లు, 30 మంది ఆరోగ్య కార్యకర్తలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 108 వాహనం, ఆక్సిజన్ సిలిండర్లు రెండు, 3 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సెలైన్లు తదితరాలను ఉంచనున్నట్టు వెల్లడించారు.

భారీ పోలీసు బందోబస్తు

బ్రహ్మోత్సవాల సందర్భంగా అసాంఘిక సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాపూరు సీఐ సుబ్రమణ్యం తెలిపారు. 200 మంది సిబ్బందిని నియమిస్తున్నట్టు వెల్లడించారు.

కండలేరులో 6.755 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.755 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.